# అమరావతి వార్త

# ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

## చిలకలూరిపేటలో పైలట్ ప్రాజెక్టు - మంత్రి రజనీ

చిలకలూరిపేట,డిసెంబర్20,ప్రభాతవార్త: ఆరోగ్య పరిరక్షణే ముఖ్య లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. అందుకోసం నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నా మని, ప్రతి ఊరికి డాక్టర్లు, ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు, క్యాన్సర్, షుగర్, కిడ్నీ, నరాల వ్యాధులకు గ్రామాలలోనే వ్యాధి నిర్దారణ పరీక్షలు, ఉచితంగా వైద్యం



అందిస్తామని తెలిపారు. పట్టణంలో 30వ వార్డు పురుషోత్తమపట్నంలో డాక్టర్ వైయస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద మోమోగ్రాఫీ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ వీఆర్ ఫౌండేషన్ మరియు ఎపి ప్రభుత్వం ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మూడు మండలాలలో వారం రోజులనుంచి 1654 మందికి స్క్రినింగ్ చేసినట్టు తెలిపారు. తొలిదశలోనే వ్యాధిని గుర్తిస్తే ప్రాణాపాయం ఉండదని అన్నారు. వారిలో 125మందికి సస్పెక్టెడ్ క్యాన్సర్ కేసులుగా గుర్తించడం జరిగిందని, ఇప్పటివరకూ నాదెండ్ల మండలంలో 497మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా 15 అనుమానిత కేసులు గుర్తించామ న్నారు. యడ్లపాడు మండలంలో 560మందికి పరీక్షలు నిర్వహిస్తే 35మందికి అనుమానిత కేసులుగా గుర్తించామని,వారికి ఈ రోజు అపోలో సంస్థ వారి బస్సు ద్వారా మోమోగ్రఫీ పరీక్ష నిర్వహించి క్యాన్సర్ ఏ దశలో ఉందో తెలుసుకొని వైద్యం చేయడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని జబ్బులకు వీఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశీలో 400 పైగా ప్రోసీజర్స్ చేర్చడం జరిగిందని, వైసిపి ప్రభుత్వం వచ్చిన ఈ మూడున్నర సంవత్స రాలలో క్యాన్సర్ కోసం రూ 1000కోట్లు ఖర్చు చేయండం జరిగిందన్నారు. చిలకలూరిపేటను ఆరోగ్యకరమైన చిలకలూరిపేటగా తయారుచేస్తామన్నారు. ఈ స్క్రినింగ్ పరీక్షలను నిరంతరం చేస్తామని, రోబోయే రోజులలో న్యూరోకి సంబందించి కూడా వైద్య సేవలు అందిస్తామని, మంత్రి తెలిపారు.

# పెళ్లి వేడుకలో భారీగా బంగారం చోరీ

గుంటూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త : గుంటూరు నగరంలో జరిగిన ఓ పెండ్లి వేడుకలో భారీగా బంగారం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాల్లోకివెళితే...గుంటూరు నగరం అమరావతిరోడ్డులోని ఫంక్షన్ హాల్ నందు గత సోమవారం రాత్రి ఓ కుటుంబంలోని వివాహ మహోత్సవం జరిగింది.ఈ వివాహ వేడుకకు వేమూరుకు చెందని కొమ్మూరు వెంకటకృష్ణ హాజరయ్యాడు.అతను తనతోపాటు బంగారాన్ని బ్యాగ్‌లో పెట్టుకొని వివాహానికి హాజరవ్వడాన్ని ఓ అగంతకుడు గమనించాడు.వెంకటకృష్ణ వధూవరులను ఆశీర్వదించేందుకు అక్షింతలు వేస్తూ తనవద్దనున్న బంగారు ఆభరణాల బ్యాగ్‌ను కుర్చీలో పెట్టి వేదికపైకి వెళ్ళాడు.తిరిగి వచ్చి చూసుకునేటప్పటికి బ్యాగ్ కనిపించకపోవడంతో ఆందోళన చెంది మండపం మొత్తం వెతికినా ఫలితం లేకపోయింది.దీంతో బ్యాగ్ చోరికి గురైనట్లు గ్రహించి అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.బ్యాగ్‌లో రూ.27లక్షల విలువగల సుమారు 65శవర్ల సమారు 60శవర్ల బంగారం ఉన్నట్లు వెంకటకృష్ణ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు.అరండల్‌పేట సీఐ రామానాయక్ నేతృత్వంలో పోలీసులు దొంగకోసం సీసీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టారు.సీసీ ఫుటేజీలో ఓ అనుమానితుడ్ని గుర్తించినట్లు తెలిసింది.దొంగకోసం పోలీసులు ప్రత్యేక బృందాల ద్వారా గాలింపు చేపట్టారు.

## చంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి ఆరాధన మహోత్సవం

గుంటూరు కల్చరల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త : స్థానిక మారుతీ నగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీవారి దేవాలయం ప్రాంగణంలో మహాస్వామి కంచి కామకోటి పీఠాధిపతులు పరమహంస పరివ్రాజకాచార్య వర్యులు జగద్గురువులు శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామి వారి 29వ ఆరాధన మహోత్సవం సందర్భంగా స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అర్చన నిర్వహించి వేద స్వస్తి జరుపుట జరిగింది. కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

గుంటూరు విద్య, డిసెంబర్ 20, ప్రభాతవార్త : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మా డి 4వ సంవత్సరం చదువు తున్న విద్యార్థిని శ్రీవర్ధిని డిసెంబర్ 15నుంచి 17వ తేది వరకు నాగార్జున యూనివర్సిటీ నిర్వహించిన యువజనో త్సవాల్లో పాల్గొని క్రాఫ్ట్ తయారీలో ప్రధమ బహమతి పొందినటుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియజేశారు

# కిడ్నీ డయాలసిస్ రోగులకు సరిపోని కృష్ణాజలాలు

ఎ కొండూరు, డిసెంబరు 20, ప్రభాతవార్త: ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం పంచాయతీ శివారు దీప్లానగర్ తండా మాన్‌సింగ్ తండా, కొత్త ఏర్పడిన ఎస్టీ మహిళ కేశా తండా, పెద తండా పంచాయతీ గ్రామాల్లో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కిడ్నీ, డయాలసిస్ బాదితుల కోసం అత్యవసరంగా వెయ్యి లీటర్ల కెపాసిటి గల సింటెక్స ట్యాంకులు ఏర్పాటు చేసి ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసి ఆయా ట్యాంకుల్లో కృష్ణాజలాలు నింపుతున్నారు. ఈ తండాల్లో ఏర్పాటు చేసిన వెయ్యి లీటర్ల కెపాసిటీ గల సింటెక్స్ ట్యాంకుల నీరు సరిపోవడం లేదని, రెండు వేల లీటర్ల కెపాసిటి గల సింటెక్స్ ట్యాంకులను ఏర్పాటు చేయాలని కృష్ణాపాలెం ఎంపిటిసి మెంబర్ భరోతు వెంకటేష్ నాయక్ (వైసిపి) ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు




విజ్ఞప్తి చేశారు. దీప్లానగర్ తండాలో బొడ్డు రాయివద్ద అదనంగా మరో సింటెక్స్ ట్యాంకు (2వేల లీటర్లు) ఏర్పాటు చేసి తండాల గిరిజనులకు కిడ్నీ, డయాలసిస్ బాధితులకు కృష్ణా జలాల సరఫరాలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకొని ఆదుకోవాలని ఎంపిటిసి మెంబర్ వెంకటేష్ నాయక్ ఎన్‌టిఆర్ జిల్లా

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి: ఎమ్మెల్యే రక్షణనిధి

ఎ కొండూరు, డిసెంబరు 20, ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణకు వాతావరణ సమతుల్యతకు ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. ఎ కొండూరు క్రాస్ రోడ్డు సమీపంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జగనన్న పచ్చతోరణం మహోత్సవం కార్యక్రమంలో మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొని, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పెంచడం వల్ల, అడవులు పెంచడం వల్ల వాతావరణ సమతుల్యం ఏర్పడి సకాలంలో వర్షాలు కురుస్తాయని దీనివల్ల మానవ మనుగడకు ఎంతో ఉపయోగమని, ఎంపిపి కాలసాని నాగలక్ష్మి, చెన్నారావు (రాడ్), సర్పంచ్ భూక్యా జాన్సీ, జడ్పీటిసి మెంబర్ భూక్యా గనియా, వైసిపి నాయకులు సోలా వెంకట నరసింహారావు, చిమట రామకృష్ణ (రేజా), జాలా ముత్తు, విస్సన్నపేట జడ్పీటిసి మెంబర్ భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ భూక్యా రాణి, ఎంపిడివో పివిఎస్ నాగేశ్వరరావు (తిరువూరు), తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, మైలవరం ఫారెస్ట్ రేంజర్ ఎం.రాణి, ఎ కొండూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.నాగజ్యోతి, జి.కొండూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ టి.సాయి, ఎ కొండూరు, చీమలపాడు, వినగడప గ్రామాల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఎ.రత్నకుమారి, జె.నరసింహారావు, యాకూబ్ బేగ్, ఎస్టీ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ టి.పుల్లారెడ్డి, సిబ్బంది, ఎ కొండూరు ఎస్సై రాజులపాటి అంకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాపై ఆరోపణల్లో నిజం లేదు : మంత్రి 'అంబటి'



సత్తెనపల్లి (పల్నాడుజిల్లా), డిసెంబర్ 20, ప్రభాతవార్త : ప్రతిపక్షాలు తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మంగళవారం ఇక్కడి విలేకరులతో ఆయన మాట్లాడుతూ చనిపోయిన వారి దగ్గర నుండి డబ్బులు వసూలు చేసే దుర్బుద్ధి, కల్మషమైన మనస్సు తనకు లేదని మంత్రి రాంబాబు అన్నారు. జనసేన పార్టీ నాయకులు వక్రభాష్యం చెప్పి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. డ్రెయినేజీలో పడి మృతిచెందిన అనీల్‌తో పాటు మరొక వ్యక్తి వీరబ్రహ్మం, రెస్టారెంట్ యజమాని కొండలరావులు కూడా మృతిచెందారని మూడు కుటుంబాలకు న్యాయం చేయాలని తాను ఆలోచించానన్నారు. మృతిచెందిన కార్మికులకు రెస్టారెంట్ యజమాని కొండలరావు కుటుంబసభ్యులు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున మధ్యవర్తుల ద్వారా ఇప్పించారని, అయితే బిల్డింగ్ యజమాని కూడా చనిపోవడంతో ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందగానే ఆ రెండున్న లక్షలు రెస్టారెంట్ యజమానికి తిరిగి ఇవ్వాలని కోరానని, జరిగిన వాస్తవం తెలియకుండా తనపై లేనిపోనివి కల్పించి ఆరోపణలు చేస్తున్నారని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. నియోజకవర్గంలో 12 మంది రైతులకు రూ.84 లక్షలు నష్టపరిహారం ఇచ్చామన్నారు. రూ.2 లక్షలు ఈ విధంగా తీసుకునే దౌర్భాగ్య పరిస్థితి తనకు ఉంటే తన పదవిని తృణప్రాయంగా వదిలివేస్తానన్నారు. ప్యాకేజీ తీసుకునే సన్యాసి నాపై ఆరోపణలు చేస్తే ఎలా ఊరుకుంటానని రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, పెండెం బాబూరావు ఉన్నారు.

# 'అంబటి' వెంటనే రాజీనామా చేయాలి

గుంటూరు అర్బన్, డిసెంబర్ 20, ప్రభాతవార్త : రాష్ట్రంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన సత్తెనపల్లి నియోజకవర్గంలో పేదల్ని ఆదుకోవాల్సిన మంత్రి అంబటి వారినే దోచుకుతింటున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. మంగళవారం

**-మంగమ్మ దంపతులకు హాని జరిగితే ఆయనదే బాధ్యత**
**-'జనసేన' రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'బోనబోయిన'**

స్థానిక లాడ్జి సెంటర్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో మంత్రి అంబటి బాధిత కుటుంబ సభ్యులతో కలసి బోనబోయిన విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బోనబోయిన మాట్లాడుతూ ప్రజల సొమ్మును సీఎం జగన్‌రెడ్డి తరహాలోనే మంత్రి అంబటి దోచుకుంటున్నాడని ఘాటుగా వ్యాఖ్యానించారు. మంత్రి తన అనుచరులను అడ్డుపెట్టుకొని బాధితుల సీఎం ఆర్ఎఫ్ సొమ్మును నొక్కేసేందుకు తెగబడ్డారని ఆరోపించారు.




వివరాలు మెయిన్‌లో

## రక్తదానం ప్రాణదానంతో సమానం :వీసి



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,డిసెంబరు20, ప్రభాతవార్త: వర్సిటీలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా గుంటూరు రెడ్‌క్రాస్, ఏఎన్‌యు ఎన్ఎస్ఎస్‌లు సంయుక్తంగా ఈ కార్యక్రమంను నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో వైస్ - ఛాన్సలర్ ప్రొఫెసర్ పట్టేటి రాజశేఖర్ 53ఏళ్ళ వయస్సులో స్వచ్ఛందంగా రక్తదానం చేయడం గమనార్హం. ఆయనతో పాటు ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య ఇ.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు రవిశంకర్, చరణ్, రవికుమార్, యుగంధర్, ఫార్మశీ, ఇంజనీరింగ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఔత్సాహికులు రక్తదానం చేశారు. వికాస భవన్‌లో ఈశిబిరంను స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ సలహాదారుడు చల్లా మధుసూదనరెడ్డితో కలిసి వీసి రాజశేఖర్ ప్రారంభించారు. రెక్టార్ ఆచార్య వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బండి కరుణ, వైద్యాదికారులు డా॥జిమ్మిరాణి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'రైల్వేలో రాయితీ నిలిపివేతపై సీనియర్ సిటిజన్స్ నిరసించాలి'

గుంటూరు కల్చరల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త : గతంలో అమలైన సీనియర్ సిటిజన్స రాయితీలను కొనసాగించలేమని,ఇప్పట్లో సాధ్యంకాదని పార్లమెంట్ సాక్షిగా కేంద్రం ప్రకటించడం వయోవృద్ధులను తీవ్రంగా కలచివేసిందని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సీనియర్ సిటిజన్స్ సమావేశంలో పాల్గొన్న వారు నిరసించారు.సమావేశానికి సంస్థ సీనియర్ సభ్యుడు కోటేశ్వరరావు



అధ్యక్షత వహించారు.సమావేశంలో అవగాహన సీనియర్ సిటిజన్ విభాగం కో-ఆర్డినేటర్ రావి వెంకటరత్నం మాట్లాడుతూ ప్రజాక్షేమమే పరమావధిగా ప్రకటిస్తూ మందుకెళుతున్న పాలకులు రాయితీల విషయమై పట్టించుకోకపోవడం వయో వృద్ధులు దిగ్భ్రాంతికి గురయ్యా రన్నారు.రాయితీలు పునరుద్దరించాలని ఎంపిలకు వినతులు,రైల్వేమంత్రికి సంతకాలు సేకరించి పంపే కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్ని సీనియర్ సిటిజన్ సంఘాలతో సమావేశాలు ఏర్పాటుచేయాలని సమావేశం నిర్ణయించింది. సమావేశంలో ఆర్.వి.సింగరయ్య, శ్రీరామ్మూర్తి,మురళీకృష్ణ,విద్యావేత్త చంద్రయ్యలు ప్రసంగించారు.

## విశ్రాంత గ్రామాధికారులకు రేషన్, 'ఆరోగ్యశ్రీ' వసతి కల్పించాలి



విజయవాడ డిసెంబర్ 20 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ వీఏఓస్, పిటిఎస్ మరియు వీఆర్‌వోస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సభాధ్యక్షులు యు.వెంకట రావు, విజయనగరం నుండి గురుమూర్తి నాయుడు ఎడ్లపాడు మండలం మాజీ గ్రామాధికారుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో 10 పిఆర్సీ ప్రకారం రూ.6500/-లు తగ్గకుండా పెన్షన్ పెంపుదల, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల వసతి, 70 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు 10శాతం పెన్షన్ పెంపుదల తదితర డిమాండ్లను సంఘం తరపు సభ్యులు కార్యచరణ చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియచేస్తామన్నారు.

## ఏపిజిఎన్ఏ ఆధ్వర్యంలో సిఎం జగన్ జన్మదిన వేడుకలు



విజయవాడ, డిసెంబర్ 20, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డి.మంజులాదేవి సిఎం జగన్మోహన్‌రెడ్డికి 'ఏపిజిఎన్ఏ' తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ క్రమంలో ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నోట సహజంగా అక్క చెల్లెమ్మలు అనే మాట మా ప్రభుత్వ నర్సులందరి మనస్సులకు హత్తుకొని, సొంత అన్నగా జగనన్న పుట్టిన రోజు ఘనంగా రాష్ట్రమంతా నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన కోర్కెలు ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తున్నారని, అలాగే మా నర్సులకిచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ ఆరోగ్య ప్రాథమిక కేంద్రాల్లో 4గురు స్టాఫ్ నర్సులను నియమించాలని, వైద్య శాఖలో పనిచేస్తున్న మహిళ ఉద్యోగులకు 5రోజులు స్పెషల్ క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని, అధనంగా రెగు ్యలర్ రిక్రూట్‌మెంట్ ద్వారా నర్సులను చేయాలని ఆనందంగా మా అన్నకు మా విన్నపాలు విన్నవించుకుంటున్నామన్నారు.

# కళాశాల ఖ్యాతి పెంచిన విద్యార్థినులు

## --ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి

గుంటూరు కల్చరల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త : తమ విద్యార్థినులు విద్యతోపాటు కళలు,క్రీడలు,ప్రతిభ పోటీ పరీక్షలల్లో అత్యుత్తమ ప్రతిభ ను చాటుతూ కళాశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేస్తున్నారని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఆర్.జోత్స్నకుమారి పేర్కొన్నారు .స్థానిక హిందూ కళాశాల ఆధ్వ ర్యంలో టిఎస్ రామారావు మెమోరి యల్ అంతర్



కళాశాలల వృక్షశాస్త్ర కవేస్ట్ 2022 పోటీల్లో భాగంగా నిర్వహించిన క్విజ్ వకృత్వ చిత్రలేఖన పోటీల్లో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు మొదటి స్థానం కైవశం చేసుకొని ఓవరాల్ చాంపియన్ గెలుచుకున్న సందర్భంగా విద్యార్థినులకు కళాశాలలో అభినందనసభ నిర్వహించారు.విద్యార్థినులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించిన అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ భాస్కరరావు,అధ్యాపకులు ఎం.సంతోషికుమారి, డి.ఉమా ,బి.జాస్మిన్,తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు చీరలు పంపిణీ

తుళ్లూరు, డిసెంబర్20, ప్రభాతవార్తః ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం తుళ్లూరు మండల కేంద్రంలోని దళితవాడలో వైఎస్సార్ సీపీ



నేతలు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సీఎం జగన్‌కు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరవ్వగా ఆయన చేతుల మీదుగా 100 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భోగినేని అప్పారావు, జమ్ముల శ్రీనివాసరావు, గంజిమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నా భార్యబిడ్డల బలవన్మరణానికి కారకులెవరు?

విజయవాడ డిసెంబర్ 20 ప్రభాతవార్త : స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారంజరిగిన విలేకరుల సమావేశంలో బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భార్య, కుమారుడు మరణ బాధితుడు చిన్నెం నాగరాజు మాట్లాడుతూ తన భార్యయైన మాధవి 29 సం॥లు, కుమారుడైన 4 సంవత్సరముల నాగపూజిత్‌తో సహా 16 సెప్టెంబర్ 2021న నంధ్యాల జిల్లా, నొస్సం గ్రామం దగ్గర చిన్న గుంటలో




దూకి ఆత్మహత్య చేసుకున్నారని బాధితుడు చిన్నెం నాగరాజు పేర్కొన్నారు. నేను ఉద్యోగ రీత్యా 2001 నుండి కేరళలో ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగ విధులు నిర్వహిస్తూ కరోనా సెకండ్ వేవ్ కారణంగా కేరళ నుండి రాలేకపోయానని, అప్పటి నుండి తన చిన్నతనంలోనే తల్లి మరణించడంతో నా భార్య పిల్లాడితో సహా పుట్టింట్లో పిన్ని సుబ్బమ్మ, తండ్రి చౌడం వెంకటరమణ' వద్దనే ఉంటున్నదని తెలిపారు. ఆ సమయంలో నా భార్యకు పిన్నమ్మ అయిన సుబ్బమ్మ, నా భార్యకు ఉద్యోగము ఇప్పిస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి డబ్బులు కాజేయటమే గాక, కాలక్షేపం కోసం నా భార్య పిన్ని సుబ్బమ్మ, నీ భర్త కేరళాలో ఎవరితోనే అక్రమ సంబంధం సాగిస్తున్నాడని, అందుకే నీ దగ్గరకు రాలేకపోతున్నాడని కల్లబొల్లి కబుర్లు చెప్పి, నన్ను, వృద్ధాప్య దశలో ఉన్న నా తల్లిదండ్రులైన చిన్నెం రామదాసు, లక్ష్మీదేవి దంపతులపై సుబ్బమ్మ, చౌడం వెంకటరమణలు కేసు నమోదు చేశారు. ఇదే విషయాన్ని సంఘటన జరిగిన తరువాత నెలలో అనగా నవంబర్‌లో నేను సాక్షాధారములతో సహా ఎస్పీ గారు, సంబంధిత ఎస్సైగారికి సమర్పించిన స్పందించలేదు. మళ్లీ 31 అక్టోబరు, 7 నవంబర్‌లో స్పందనలో నంధ్యాల ఎస్పీ గారికి ఫిర్యాదు చేసిన స్పందించలేదు. మీడియా సాక్షిగా నాకు తగు న్యాయము జరుగుతుందని నేను ఆశిస్తున్నానన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షుడు మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా వార్త



## నేడు వైకాపా సేవా కార్యక్రమాలు



చిలకలూరిపేట,డిసెంబర్20,ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.మంగళవారం విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఉదయం 9.30 గంటలకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజిని గారి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ కార్యక్రమం, సర్వమత ప్రార్ధనలు, అన్నదాన కార్యక్రమా లు జరుగునని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానలు అందరూ పాల్గొని జయప్రదం చేయవలసినదిగా వైయస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## లబ్ధిదారులకు గృహాలు అప్పగించాలి : 'తెలుగు మహిళ' డిమాండ్

చిలకలూరిపేట, డిసెంబర్20,ప్రభాతవార్త: పట్టణంలోని మంచినీటి చెరువు వద్ద 52 ఎకరాలలో నిర్మించిన పియంఏవై గృహ సముదాయాలను వెంటనే లబ్ధిదారులకు అప్పగించాలి అని టిడిపి మహిళా నేతలు డిమాండ్ చేశారు. గత మూడున్నర సంవత్సరాలుగా ఏంతో ఆశగా ఇళ్లకోసం ఎదురు చూస్తున్న లబ్దిదారులను గృహప్రవేశాల పేరుతో ఆర్భాటంగా సమావేశం ఏర్పాటు చేసి



ఇళ్లకు సంబందించి అనుమతి పత్రాలు కానీ, ఇళ్ల తాళాలు కానీ అప్పగించకుండా లబ్దిదారులను ఇబ్బంది పెట్టారని తెలుగు దేశం పార్టీ మహిళా నాయకులు మంగళవారం విలేకరుల సమావేశంలో అన్నారు. తెలుగుదేశం పార్టీ హయంలో ఇళ్ల పనులు దాదాపూ పూర్తి అయ్యాయని, కేవలం 10శాతం పనులకు మూడున్నర సంవత్సరాలు కాలం పట్టిందని, అయినప్పటికి ఆర్భాటంగా ఇళ్ళు ఇస్తున్నామంటూ ప్రచారం చేసుకొని లబ్దిదారులను పిలిపించి వారికి ఇళ్ల అప్పగించకపోవటం ఏమిటని వారు ప్రశ్నించారు. లబ్దిదారులను ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూర్చోబెట్టుకొని, వట్టిచేతులతో వారిని ఇంటికి పంపించడం జరిగిందన్నారు. ఇది లబ్దిదారులను మోసం చేయటమేనని వారు అన్నారు. తక్షణమే లబ్దిదారుల ఇండ్లను వారికి అప్పగించాలని వారు డిమాండ్‌చేశారు. క్వారంటైన్ సెంటర్ పేరుతో నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. టిడిపి అదికారంలోకి వచ్చిన వెంటనే మాజీమంత్రి, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో గృహ సముదాయాలను సంపూర్ణ వసతులతో లబ్దిదారులకు అప్పగిస్తామన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిళ నాయకులు పాల్గొన్నారు.

## 'జగన్‌ను నమ్మి ఓటేసిన మహిళలు మోసపోయారు'

చిలకలూరిపేట,డిసెంబర్20,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాయమాటలు నమ్మి ఓటువేసి రాష్ట్రంలో మహిళలు మోసపోయారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి జరీనా సుల్తానా అన్నారు.మంగళవారం 25వ వార్డులో టిడిపి పార్టీ జాతీయ



అధ్యక్షుడు నారా చంద్రబాబు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి ప్రత్తిపాటి ఆదేశాల మేరకు "మాటా-మంతి" కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో రాష్ట్ర టిడిపి మహిళ ప్రధాన కార్యదర్శి జరీనా సుల్తానా పాల్గొని మాటా మంతి కరపత్రాలను ఆ వార్డులో మహిళలకు అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాటా మంతి కార్యక్రమం ద్వారా మహిళలలో చైతన్యం తీసుకురావాలన్నారు. టిడిపి హయంలో అమలుచేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు వైసిపి ప్రభుత్వం వచ్చాక వెనుకబడ్డాయని ఈ విషయాన్ని మహిళలోకి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు అమరా రమాదేవి, ప్రధాన కార్యదర్శి పోపూరి లక్ష్మీ, 13వ వార్డు టిడిపి ఇన్‌చార్జి షేక్ బషిరూన్, షేక్ గౌస్యా, అద్దంకి అనితబాయి, కౌన్సిలర్లు కొత్తకుమారి, కె లక్ష్మీ తిరుమల, కూనల ప్రమీల, కంచర్ల కరుణ, రాయని హరిత, పాములపాటి శివకుమారి, జంగా సుజాత తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 'జనసేన' కౌలురైతు భరోసా యాత్రకు ఎన్నారై విజయ్ రూ.లక్ష విరాళం

చిలకలూరిపేటటౌన్,డిసెంబర్20,ప్రభాతవార్త: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను చిలకలూరిపేట



నియోజకవర్గానికి చెందిన జనసైనికుడు, ఎన్ఆర్ఐ బీసాబత్తుని విజయ్, జనసేన నాయకుడు పెంటేల బాలాజీ మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్య ంలో జరుగుచున్న కౌలురైతు బరోసా యాత్రకు తన వంతుగా పవన్‌కళ్యాణ్‌కు రూ 1లక్ష రూపా యిల చెక్కును ఎన్ఆర్ఐ బి విజయ్ అందించారు. బీసాబత్తుని విజయ్‌ను పవన్‌కళ్యాణ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు పెంటేల బాలాజీ పాల్గొన్నారు.

## 'జనసేన' నేత రాజారమేష్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ



చిలకలూరిపేట,డిసెంబర్20 ,ప్రభాత వార్త: పట్టణంలో ఆదిఆంధ్ర కాలనీలో ఉన్న బాసిస్ట్‌మినిస్ట్రిస్ చర్చిలో మంగళ వారం సెమి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జనసేన జిల్లా కార్యదర్శి తోట రాజారమేష్ పాల్గొని కేక్ కట్‌చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియ చేశారు.అనంతరం వృద్ధ మహిళకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసుక్రీస్తు ఈలోకాన్ని ఏంతగానో ప్రేమించారని, ఆయన చూపిన ప్రేమ,దయ, మన అందరిలో కలిగి ఉండాలన్నారు.అనంతరం ఫాస్టర్ యాకోబు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పఠాన్ ఖాదర్‌భాష, మునీర్ హసన్, స్టీల్ అంజి, జానీభాష, పసుపులేటి సాయి, గౌస్, రవి తదితరులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## 'రంజాన్, క్రిస్మస్ సందర్భంగా పాఠశాలలకు 10 రోజులు సెలవుదినాలుగా ప్రకటించాలి'

చిలకలూరిపేట,డిసెంబర్20,ప్రభాతవార్త: రంజాన్ క్రిస్మస్ పండుగలకు పాఠశాలలకు 10రోజులు సెలవుదినాలుగా ప్రకటించాలని యంఆర్‌పియస్ నాయకులు కోరారు. ఈ మేరకు వినతిపత్రాన్ని



ఆర్‌డిఓ శేషిరెడ్డికి మంగళవారం నరసరావుపేట ఆర్‌డిఓ కార్యాల యంలో అందచేశారు. ఈ సందర్భంగా పల్నాడుజిల్లా యంఆర్‌పియస్ నాయ కుడు కోట సుబ్బుమాదిగ మాట్లాడుతూ రంజాన్,క్రిస్మస్ పండుగలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం భాదాకర మన్నారు.హిందూ పండుగలతో పాటు గా క్రిస్మస్, రంజాన్ పండుగలకు సెలవుదినాలు ప్రకటిం చాలని, గురుకుల పాఠశాలలలో మరియు ప్రైవేటు కళాశాలలలో సిసి కెమేరాలు తప్పనిసరిచేయాలన్నారు .5సంవత్సరాలు పైబడిన, పై చదువులు చదువుతున్న ప్రతి పేదవిద్యార్థికి ఎటువంటి ప్రమాదం జరిగినా రూ 10లక్షలు భీమా సౌకర్యం యాజమాన్యం కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎపి యంఆర్‌పియస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాట్ల దానియేలు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు




నరసరావుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో పాటు క్రైస్తవ మత పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తెలియజేశారు. ప్రేమ, కరుణ ప్రపంచానికి ఏసుక్రీస్తు పరిచయం చేశారని తెలిపారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ ఏపి వ్యాప్తంగా చర్చిల అభివృద్ధికి సిఎం జగన్ రూ.175 కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ నిధులను చర్చిల నిర్మాణం, మరమ్మత్తులు, ఇతర పనులకు ప్రభుత్వం వినియోగిస్తుందని కలెక్టర్ శివశంకర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉప్పలపాడు జెడ్పీ పాఠశాలలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

నరసరావుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఏ ముఖ్యమంత్రి వ్యయం చేయని విధంగా సిఎం జగన్ కోట్ల రూపాయలను కేటాయించారని తెలిపారు. నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన వ్యక్తి సిఎం జగన్ అని అన్నారు. నాటిన ప్రతి మొక్కను సిఎం పుట్టినరోజు బహుమతిగా విద్యార్థులు అందించాలన్నారు. 8వ తరగతి చదువుతున్న ప్రతి ఒక్కరికీ ట్యాబ్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. బాగా చదువుకోవాలన్నారు. నాటిన మొక్కను సంరక్షిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని, ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తెదేపా నేతలపై దాడి నిందితులను శిక్షించాలి

నరసరావుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : తెలుగుదేశంపార్టీ నాయకులపై మాచర్లలో జరిగిన దాడులకు న్యాయం చేయాలని, సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు కోరారు. మంగళవారం ఈ మేరకు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని ఆయన



కార్యాలయంలో వారు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకర్లతో జి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ మాచర్లలో పార్టీ కార్యాలయంతో పాటు టిడిపి సానుభూతిపరుల ఇళ్ళు, వాహనాలు ధ్వంసం చేశారని తెలిపారు. బాధితులకు న్యాయం చేయడంతో పాటు వారికి రక్షణ కల్పించాలన్నారు. అమాయకులపై అక్రమ కేసులు, అరెస్ట్‌లు ఆపాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నా స్థానిక ఎమ్మెల్యే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. బాధితులను పరామర్శించేందుకు తమకు అవకాశం కల్పించాలన్నారు. శాంతిభద్రతలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కొంత మందిని పంపి, మరికొంత మందిని భయపెట్టి అధికారంలోకి రావాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. మాచర్ల వెళ్ళేందుకు తమకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంపై జి.వి.ఆంజనేయులు అసహనం వ్యక్తం చేశారు. పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందని జి.వి.ఆంజనేయులు విమర్శించారు. సమావేశంలో పార్టీ నాయకులు నల్లపాటి రాము, గొట్టిపాటి జనార్ధన్‌బాబు, కొట్టా కిరణ్, కడియాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో సంచలనం రేపిన దారుణ హత్య



నరసరావుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : కత్తితో దాడి చేసి ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన మంగళవారం పట్టణంలోని కర్ణాటక బ్యాంక్ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. షేక్.ఇబ్రహీం అనే మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు కత్తులతో ఆకస్మికంగా దాడి చేశారు. విచక్షణారహితంగా ఆయనను పొడిచారు. అక్కడికక్కడే ఇబ్రహీం మృతిచెందారు. అత్యంత రద్దీగా ఉండే బ్యాంక్ వీధిలో ఈ హత్య జరగడం స్థానికంగా కలకలం కలిగించింది. హత్య సంఘటన విషయం తెలియడంతో స్థానికులు, మైనార్టీలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ఇబ్రహీంతో పాటు ద్విచక్ర వాహనంపై ఉన్న రహమత్ ఆలీ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతనిని కూడా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దివ్యసాయి కాంప్లెక్స్ వద్ద జరిగిన సంఘటనలో వరవకట్ట ప్రాంతానికి చెందిన ఇబ్రహీంను హత్య చేసిన అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి నుండి పారిపోయారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ సి.ఐ.అశోక్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని డిఎస్పీ విజయభాస్కరరావు పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా నిందితులను పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తామని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. హత్యకు సంబంధించి అన్ని కోణాలలో విచారణ జరుపుతామని, నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని డిఎస్పీ కె.విజయభాస్కర్ స్పష్టం చేశారు.

## సిఎం పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం

విజయపురిసౌత్, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని వైకాపా పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా విజయపురిసౌత్‌లో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. స్థానికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కాలేజ్ నందు 71వ వన మహోత్సవంలో భాగంగా ఎంపిపి బూడిద



శ్రీనివాస్, రేంజ్ ఆఫీసర్ బి.జి.వి.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ చందు ఆంజనేయులు సుమారు 250 మొక్కలను నాటారు. కార్యక్రమంలో విద్యార్థులకు వంద మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పరుగు పందెంలో జి.పవన్ కుమార్, ఎంఈసి రెండవ సంవత్సరం జి.రాజు, ఎంపిసి రెండవ సంవత్సరం విద్యార్థులు మొదటి, రెండవ స్థానాలను సాధించారు. విజేతలకు ట్రోఫీలను ఎంపిపి రేంజ్ ఆఫీసర్, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ ఖాశిం, గోపిచంద్, అధ్యాపకులు రంగాచార్యులు, చంద్రశేఖర్, ఎన్‌సిసి ప్రోగ్రాం ఆఫీసర్ రాజశేఖర్, పుల్లయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'మండల కమిటీలను వెంటనే పూర్తిచేయాలి'



చిలకలూరిపేట, డిసెంబర్20, ప్రభాత వార్త: రాష్ట్ర పదాధికారులు ఆ జోను జిల్లా కమిటిలు త్వరితగతిన పూర్తిచేసి పటిష్ట పరచాలని రాష్ట్ర ఓబిసి మోర్చా ప్రోగ్రాం కన్వీనర్ అన్నం శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఒంగోలులో విష్ణుప్రియ ఫంక్షన్ హాల్‌లో జరిగిన జోన్ 3 ఓబిసి మోర్చా సమావేశంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రోగ్రాం కన్వీనర్ అన్నం శ్రీనివాసరవు పాల్గొని ప్రసంగిస్తూ తదుపరి బీసి సామాజిక చైతన్య సభకు కార్యోన్ముఖులు కావలసినదిగా నాయకులను కోరారు.

## దుర్గి ఎస్ఐగా వెంకటరమణ



దుర్గి, డిసెంబర్ 20, ప్రభాతవార్త : దుర్గి ఎస్సైగా వెంకటరమణ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై పాల్ రవిందర్ సెప్టెంబర్ 29న బదిలీపై వెళ్ళటంతో ఇప్పటివరకు రెంటచింతల ఎస్సై సమీర్‌భాషా ఇన్‌చార్జి ఎస్సైగా వ్యవహరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్సై వెంకటరమణ నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటిన అధికారులు



దుర్గి, డిసెంబర్ 20, ప్రభాతవార్త : దుర్గి మండల ప్రజాపరిషత్, జిల్లాపరిషత్ పాఠశాలలో మంగళవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఎంపిపి ఏచూరి సునీతాసాయిశంకర్, జెడ్పిటిసి శెట్టిపల్లి యలమంద, మార్కెట్‌యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ చేతులమీదుగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల యస్‌యంసి చైర్మన్ తోటకూర వెంకటేశ్వర్లు, ఎగటీల బుచ్చిబాబు, గ్రామ సర్పంచ్ చాట్ల శాంత రమేష్, ఎంపిడిఓ గుప్తా, ఎపివో వెంకటేశ్వర్లు, పంచాయితీ కార్యదర్శులు హాఫీజుద్దీన్, వెంకటేష్, సిసి చంద్రయ్య, అటవీశాఖ అధికారులు వెంకయ్య, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, మండల ప్రజాపరిషత్ ఎవో శివ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అధికారులకు శిక్షణ



యడ్లపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు(ఎస్డిజి) కార్యక్రమాలపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వై హనుమారెడ్డి వివరిస్తూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనేవి 2030నాటికి ప్రపంచంలోని బహుముఖ రంగాలలో పేదరికాన్ని రూపు మాపడానికి సమస్త విశ్వ శ్రేయాభివృద్ధి కోసం ఒక సమానమైన న్యాయమైన మరియు సురక్షితమైన ప్రపంచాన్ని రూపొందించడానికై తీసుకొన్న ఒక దృఢమైన సాత్వికా ఒప్పందమని, ఇందులో 17సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి స్థానిక అధికారులకు శిక్షణ నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇవోపిఆర్‌డి వరూధిని, అంగన్వాడీ సూపర్‌వైజర్ జోజమ్మ, వాణి పాల్గొన్నారు.

## 28న జిల్లా స్థాయి జూనియర్స్ బాలురు, బాలికల టోర్నమెంట్



యడ్లపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త : పల్నాడు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 28వ తేది ఉదయం 9గంటల నుండి జిల్లా స్థాయి జూనియర్స్ యూ-19 బాలురు, బాలికల టోర్నమెంట్ నిర్వహించటం జరుగుతుందని పల్నాడు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి సాంబశివరావు తెలిపారు. ఈ పోటీలలో గెలు పొందిన వారికి ఒకటోవ, రెండోవ, మూడోవ స్థానాలకు మెరిట్ సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని, ప్రవేశరుసుము 150రూపాయలని, అదేవిధంగా అదేరోజున జిల్లా స్థాయి సీనియర్స్ ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికలకు వచ్చువారు జట్టుగాని, విడివిడిగా కూడా పాల్గొనవచ్చునన్నారు. ప్రవేశరుసుము వందరూపాయలు పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ ఇవ్వబడుతుందని తెలిపారు. టోర్నమెంట్ మరియు సెలెక్షన్స్ ఎస్‌పిటిఅర్‌కెఎమ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పురుషోత్తపట్నం చిలకలూరిపేట నందు జరుగుతుందన్నారు. పూర్తివివరాలకు ఇంటల్ హైస్కూల్ పిడి షేక్ హుస్సేన్ సెల్‌నెంబరు 9966122055, 9182326427ఫోన్ చేసి తెల్సుకోవచ్చునన్నారు.

## ద్విచక్రవాహనం ఢీకొని ఒకరు మృతి



యడ్లపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త : మండల పరిధిలోని తిమ్మాపురం నుండి నాదెండ్ల వెళ్లే మార్గంలో గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై పి రాంబాబు వివరిస్తూ ఒరిస్సా రాష్ట్రము, గంజాం జిల్లా నలబంట మండలం చర్మారియా గ్రామమునకు చెందిని తోఫాన్ స్వైన్(39)అతని భార్య బిష్ణు స్వైన్ ఇరువురు కృష్ణమూర్తి స్పిన్నింగ్ మిల్లులో విధులు నిర్వహించుతున్నారని, ఇతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, అయితే రోజువారీగా మిల్లు నుండి పాలుకోసం ఇరువురు తిమ్మాపురం గ్రామంకు నడిచి వస్తున్న తరుణంలో గుర్తుతెలియని ద్విచక్రవాహనం బలంగా ఢీకోనటం క్రిందపడిపోగా వెంటనే భార్య చిలకలూరిపేట వైద్యశాలకు తరలించి ప్రాధమిక చికిత్స నిర్వహించి అనంతరం మిల్లుకు చేరటం జరిగిందని, అయితే మరుసటి రోజు మంగళవారం విపరీతంగా నొప్పులు రావటంతో వెంటనే కంపెనీకి చెందిన రాజేంద్ర కుమార్ సహాయంతో వైద్యశాలకు తరలించగా అక్కడ స్కానింగ్‌లు తీయించి వైద్యశాలకు వెళ్ళగా అక్కడ ఉదయం మృతి చెందటం జరిగిందన్నారు. భార్య ఫిర్యాదు మేర కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహించుతున్నామని తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

యడ్లపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త : మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామంలో యవకుడు చిక్సితపొందుతూ మంగళవారం మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి ఎస్సై పి రాంబాబు వివరిస్తూ వంకాయలపాడు గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ భీ తన మూడవ కుమారుడు షేక్ రసూల్(30) తన భార్య భర్తల మధ్య వచ్చిన చిన్నపాటి గొడవ కారణంతో మద్యం తాగిన మత్తులో ఉన్న రసూల్ భార్యను బెదిరించాలన్న ఉద్దేశంతో చాకుతో కుడివైపు పొట్టలో పొడుచుకోవటం జరిగిందని, వెంటనే స్థానిక వైద్యశాలలో చికిత్స చేయించి మరలా మంగళవారం ఉదయం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేస్తున్న తరుణంలో రసూల్ మృతి చెందటం జరిగిందన్నారు. ఇతనికి భార్య మాధవి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారన్నారు. తల్లి షేక్ మస్తాన్‌బీ ఇచ్చిన ఫిర్యాదు అదారంగా కేసు నమోదుచేసుకొని దర్యాప్తు నిర్వహించుతున్నామన్నారు.

## సిఎం జగన్ పుట్టిరోజు వేడుకను ఘనంగా జరుపుకుందాం: ఎమ్మెల్యే పీఆర్కే



మాచర్ల, డిసెంబరు 20 ప్రభాతవార్తః రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మొక్కలు నాటడం వలన పర్యావరణాని సంరక్షించుకోవచ్చన్నారు. వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి మొక్కలను నాటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, పోలా శ్రీను, ఉప్పలపాడు జాని, పెద్దబ్బాయి, జీకే కోటిరెడ్డి, పులుసు దశరదరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పశర్లపాడులో నూతన చర్చి ప్రారంభం



మాచర్ల, డిసెంబరు 20 ప్రభాతవార్తః ఆలయాలు ప్రశాంత వాతావరణానికి దోహదం చేస్తాయని ప్రభుత్వ విప్, మాచర్ల శాససభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రెంటచింతల మండలంలోని పశర్లపాడులో గ్రేస్ పెంతెకోస్తు చర్చి మినిస్ట్రీస్ ఆధ్వర్యాన రూ. 15 లక్షలతో నూతనంగా నిర్మించిన చర్చిని మంగళవారం ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రార్థనా మందిరాలు, ఆలయాల ఏర్పాటు హర్షనీయమన్నారు. ఇవి బావితరాలకు ఆధ్యాత్మిక సంపదలన్నారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే పీఆర్కేను పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, బ్రహ్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ భాస్కరరెడ్డి, మట్టారెడ్డి, పాస్టర్ అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ, సచివాలయాల్లో ఎమ్డీఓ తనిఖీ



మాచర్ల, డిసెంబరు 20 ప్రభాతవార్తః మండలంలోని రేగులవరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో సురేష్ విజయ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణిలు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం వివరాలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే దానిపై ఆరా తీశారు. అనంతరం లచ్చమ్మబావిలో సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. వాలంటీర్లు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.

## ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి చర్యలు

వెల్దుర్తి, డిసెంబరు 20 ప్రభాతవార్తః ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు వైద్యాధికారి శ్రీరామ్ తెలిపారు. చినపర్లపాడుతండా, పట్లవీడు, వెల్దుర్తి గ్రామాల్లో ఒకొ్కటి చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు దారుల వయసు 25 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. దరఖాస్తు చేసిన ఫారాలను ఉప్పలపాడు పీహెచ్‌సీ కేంద్రంలో నేరుగా అందజేయాలన్నారు. ఈనెల 23వ తేదీ దరఖాస్తు అందించేందుకు చివరితేదీగా డాక్టర్ శ్రీరామ్ తెలిపారు.

## మాచర్లలో మెగా ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



మాచర్ల, డిసెంబరు 20 ప్రభాతవార్తః అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్, విజయవాడ రమా నర్సింగ్‌హోం, మాచర్ల రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల రమా నర్సింగ్ హోంలో మంగళవారం మెగా ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ వైద్యులు రామకోటయ్య పాల్గొని ఈ శిభిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్, డాక్టర్ సౌమ్య, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, తుమ్మల సత్యప్రసాద్, కోశాధికారి అన్నపురెడ్డి నాగార్జునరెడ్డి, చందోలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



మాచర్ల క్రైం, డిసెంబరు 20 ప్రభాతవార్తః వెనుకగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పట్టణంలోని పాతూరుకు చెందిన ఓ యువకుడు మంగళవారం మృతిచెందాడు. 21వ వార్డుకు చెందిన ఉప్పుతోళ్ల అనిల్ (27) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం డ్యూటి ముగించుకొని ద్విచక్రవాహనంపై పట్టణ శివారులోని యజమాని వద్దకు వెళ్తున్నాడు. రాయవరం జంక్షన్ సమీపంలో వెనుకగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అతను వాహనంపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. 108 వాహనంలో క్షతగాత్రుడ్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స నిర్వహిస్తుండగా అనిల్ ప్రాణాలువిడిచాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించారు.

## క్రీస్తు మార్గం అందరికీ ఆదర్శం : ఎమ్మెల్యే 'నంబూరు'



అచ్చంపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : శాంతి, సహనం, అందరి పట్ల ప్రేమతో జీవించాలని ఏసుక్రీస్తు చూపించిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. అచ్చంపేట మండలంలోని కొండూరు గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు బాటలో అందరూ బాగుండాలనే తాపత్రయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి మరోసారి గెలిపిస్తే ఇంతకన్నా ఎక్కువ అభివృద్ధి చేస్తారని చెప్పారు.

## ప్రకృతి సేద్యంలో పంట కోత ప్రయోగాలు



బెల్లంకొండ, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ప్రకృతి సేద్యంలో పండించిన వరి పంటలో పంట కోత ప్రయోగాలు చేయడం జరిగింది. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని నందిరాజుపాలెం యూనిట్‌లోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు తేళ్ళూరి మధుసూదనరెడ్డి వరి పంటలో 5 ఇన్‌టూ 5 మీటర్ల విస్తీర్ణంలో 16.70 కిలో గ్రాముల ధాన్యం దిగుబడి రావటం జరిగింది. ఒక ఎకరాకు 35 బస్తాల (75 కేజీ) దిగుబడి వస్తున్నట్లు అంచనా వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిఎ అయ్యప్ప, క్రోసూరు డివిజన్ మాస్టర్ ట్రైనర్ టి.సైదయ్య, యూనిట్ ఇన్‌ఛార్జి ఎం.అనంతలక్ష్మి, ఐసిఆర్‌పి మాధవి, పద్మావతి, రైతులు పాల్గొన్నారు.

## ఘనపంగా సిఎం జగన్ జన్మదిన వేడుక



క్రోసూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : జనహృదయనేత, పేదల పెన్నిధి, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 50వ పుట్టిన రోజు సందర్భంగా పెదకూరపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సారధ్యంలో గత వారం నుంచి వారోత్సవాలు చేస్తున్నటువంటి సహోదయ ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న ఆరవ రోజు భాగంగా మంగళవారం వరికోత, మిర్చి కోత కోస్తున్న కూలీలతో కలిసి కేక్ కటింగ్ నిర్వహించి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా కూలీ మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గఫూర్, ఎంపిపి తిరుమలపల్లి కోటయ్య, పోతురాజు శ్రీనివాసరావు, గంజనబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు వెలది అప్పారావు, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## 7వ వార్డులో 'గడప-గడపకు మన ప్రభుత్వం'



వినుకొండ, డిసెంబర్20, ప్రభాతవార్త: పట్టణంలోని 7వ వార్డులో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గడప-గడపకు మన ప్రభుత్వంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ద్వారా అందించిన లబ్ధిని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక పూర్తి స్థాయిలో పేదలకు, అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. వైకాపా పాలనను సహించలేక తెదేపా అడ్డుదారి ప్రజలను మభ్యపెట్టేందుకు తప్పుడు ప్రచారం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో నియోజవకర్గ స్థాయి నాయకులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'గీతమ్స్' విద్యార్థుల ప్రతిభ



వినుకొండ, డిసెంబర్20, ప్రభాతవార్త: పట్టణంలోని గీతమ్స్ హై స్కూల్ నందు నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంతన్ పరీక్షా పోటీల్లో గీతమ్స్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఎం. దుర్గాగణేష్, కె.జగన్‌మోహన్‌రెడ్డి, వి. యశస్విని, కె. వైష్ణవరెడ్డి, డివి మణికంఠ, వై. మేఘనారెడ్డి, ఎం. ప్రణతి, టి. సాయిదేవి ప్రియా, వై. శ్రీలేఖలను స్కూల్ కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

## సీఎం జన్మదిన వేడుకల సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం



వినుకొండ, డిసెంబర్20, ప్రభాతవార్త: సీఎం వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా జగనన్న కాలనీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు పెంపకం ఎంతో అవసరమని అన్నారు. ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి, ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల సంఘం కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు




వినుకొండ, డిసెంబర్20, ప్రభాతవార్త: స్థానిక న్యాయవాద సంఘ కార్యాలయంలో క్రిస్టియన్ అడ్వకేట్స్ ఫోరం తరుపున న్యాయవాదులు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ న్యాయవాది ముట్లూరి ఎలీషాబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మండల తహశీల్దార్ బి. కిరణ్‌కుమార్ హాజరయ్యారు. కేక్ కటింగ్ అనంతరం రెవరెండ్ పాస్టర్ బి. సునాత్‌కుమార్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. సీనియర్ న్యాయవాదులు పి.జె లూకా, ఏజీపీ ఎం.ఎం ప్రసాద్ తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎండిఆర్టీ సదస్సుకు మాదాల హనుమంతరావు



వినుకొండ, డిసెంబర్20, ప్రభాతవార్త: అమెరికాలో జరిగే ఎల్ఐసి ప్రతిష్టాత్మక ఎండిఆర్టి సదస్సుకు స్థానిక ఎల్ఐసి ఏజెంటు మాదాల హనుమంతరావు నాలుగోసారి అర్హత సాధించారు. ఈ మేరకు బ్రాంచి మేనేజర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆర్. శివారెడ్డి మాదాల హనుమంతరావును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ఎంతో కష్టపడి మాదాల హనుమంతరావు స్థాయికి చేరుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్ గంధం బాలిరెడ్డి, ఏజెంట్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్. హరినాథ్‌బాబు, కొలగాని కోటయ్య, సిహెచ్ కోటి రామ్మూర్తి, సిహెచ్ ఆదిరెడ్డి, గుప్తా, ఎల్ఐసి స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సిఎం జగన్ జన్మదిన వేడుకలు



అమృతలూరు, డిసెంబరు 20, ప్రభాతవార్త ః సిఎం జగన్మోహనరెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన అమృతలూరులో ఘనంగా నిర్వహించారు. గుంటూరు జిల్లా ముస్లిం మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి షేక్ ఇమామ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సిఎం జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేశారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సిఎం జగన్ ఎంతో కృషిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ షేక్ కరీమా, షేక్ అల్తాఫ్, షేక్ ఖాదర్ మస్తాన్, షేక్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

# హత్యపై అసత్య ప్రచారాలు చేయొద్దు

### - నిష్పక్షపాతంగా దర్యాప్తు - దోషులు ఎవరైనా కఠినచర్యలు : ఎమ్మెల్యే గోపిరెడ్డి



నరసరావుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : పట్టణంలో జరిగిన ఇబ్రహీం అనే వ్యక్తి హత్య సంఘటనపై అసత్య ప్రచారాలను చేయవద్దని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీపై నిందలు మోపవద్దని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడారు. పట్టణంలో జరిగిన సంఘటన దురదృష్టకరమన్నారు. ఈ సంఘటనపై ప్రభుత్వ హత్య అని, రాజకీయ లబ్ది కోసం అధికారపార్టీ వారే చేశారని ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు. 70 సంవత్సరాల వయస్సు కలిగిన పెద్ద వ్యక్తిని చంపాల్సిన అవసరం ఎవరికి వచ్చిందో, ఇందుకు గల కారణాలు ఏమిటో పోలీసుల విచారణలో తెలుస్తుందన్నారు. మసీదు నిర్మాణానికి షాపింగ్ కాంప్లెక్స్‌లో కొంత స్థలాన్ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. మసీదుపై ఎటువంటి స్టే లేదన్నారు. అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పై మాత్రమే కోర్టులో కేసు నడుస్తుందన్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో 72 మంది పేదవారు ఉన్నారని వారి జీవనం కోసం త్వరితగతిన కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అయితే ఈ నిర్మాణానికి సంబంధించి రెండు గ్రూపుల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నాయన్నారు. హత్యకు సంబంధించి ఎటువంటి విభేదాలు కారణమయ్యాయో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. గడిచిన మూడేళ్ళ కాలంలో ఎటువంటి హింసాత్మకమైన చిన్న సంఘటన జరగలేదన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని, పార్టీలో ఉన్నటువంటి వారికి ఎవరికైనా సంబంధం ఉన్నట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు.

## అగ్నిపత్‌కు ఎంపికైన ఎస్ఎస్ఎన్ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్స్



నరసరావుపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : అగ్నిపత్‌కు ఎస్ఎస్ఎన్ కళాశాలకు చెందిన ఏడుగురు ఎన్‌సిసి క్యాడెట్స్ ఎంపికయ్యారు. మంగళ వారం కళాశాలలో జరిగిన అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తాలు విద్యార్థులను అభినందించారు. ఇండియన్ ఆర్మీకి ఎంపికైన డి.గోపిరెడ్డి, వి.చిన్నవీరయ్య, జి.వంశీకృష్ణ, పి.నాగార్జున, పి.శ్రీనివాసయాదవ్, కె.బాలాజీలను వారు అభినందించారు. కార్యక్రమానికి మేజర్ కెప్టెన్ బిఎస్ఆర్‌కె రాజు అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ మల్లయ్య, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్‌ఫండ్‌లో మంత్రి 'అంబటి' అవినీతి



సత్తెనపల్లి, డిసెంబర్ 20 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి సహాయనిధిలో కూడా మంత్రి అంబటి రాంబాబు అవినీతికి పాల్పడుతున్నాడని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర నాయకులు ఆరోపించారు. సత్తెనపల్లి పట్టణానికి చెందిన తురక అనీల్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. అయితే ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.5 లక్షలు మంజూరయ్యాయి. మంజూరైన చెక్కును బాధిత కుటుంబానికి ఇచ్చేందుకు రూ.2.50 లక్షలు ఇవ్వాలని మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారని నాయకులు ఆరోపించారు. దీనిపై అంబటి రాంబాబు వివరణ ఇవ్వడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవ చేశారు. ఇలాంటి విషయాలు సభ్యసమాజంలో తలదించుకునేలా ఉన్నాయన్నారు. వైకాపా నాయకుల అవినీతికి ఇది పరాకాష్ట అని వారు అన్నారు. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కార్యదర్శి చౌటా శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ సాంబయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు కటకం రామకృష్ణలు అన్నారు.

### అంబటి రాంబాబు రాజీనామా చేయాలి : టిడిపి నాయకుల డిమాండ్ ...

అవినీతికి పాల్పడుతున్న మంత్రి అంబటి రాంబాబు వెంటనే మంత్రి పదవి, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని తెలుగుదేశంపార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ పెద్ద కరిముల్లా, అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, పలువురు టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. డ్రైయినేజీ శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందిన అనీల్ కుటుంబానికి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.5 లక్షలు మంజూరు చేస్తే అందులో సగం ఇవ్వాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్త చల్లంచర్ల సాంబశివరావు బేరం పెట్టారని, ఈ విషయాన్ని మృతుని కుటుంబసభ్యులు మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకెళ్తే తప్పనిసరిగా ఇవ్వాల్సిందేనని మంత్రి చెప్పినట్లుగా బాధితులు అంటున్నారన్నారు. ఇకనైనా ఇలాంటి అవినీతిపనులు చేయకుండా వెంటనే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు అంబటి రాంబాబు, ఛైర్‌పర్సన్‌లు తమ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ఎంపిటిసి సుబ్బారెడ్డికి మాతృవియోగం



అచ్చంపేట, డిసెంబర్ 20 ప్రభాతవార్త : మండలంలోని రుద్రరం గ్రామానికి చెందిన వైకాపా నాయకులు, రుద్రవరం ఎంపిటిసి మేకా సుబ్బారెడ్డి మాతృమూర్తి మేక సామ్రాజ్యం మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారి స్వగృహానికి వెళ్ళి సామ్రాజ్యం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సామ్రాజ్యం మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## బేడ బుడిగ జంగాలకు నివేశనా స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలి : సిపిఐ



క్రోసూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : బేడ, బుడిగ జంగాలకు నివేశన స్థలాలు, రేషన్‌కార్డులు ఇవ్వాలని పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన క్రోసూరులో సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మండల సిపిఐ కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల పక్షాన సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందని ఇప్పటికైనా సంబంధించిన అధికారులు అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు అందజేయాలని నాగేశ్వరరావు అన్నారు నియోజకవర్గ రైతు సంఘం నాయకులు కంచేటి పెద్దబ్బాయి, ఏవైఎఫ్ కార్యదర్శి పి.నాగరాజు, క్రోసూరు పట్టణ సిపిఐ కార్యదర్శి పాల్గొన్నారు.

## 'సిఎం జగన్ పాలనలోనే పేదల సంక్షేమం'



పెదకూరపాడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : మనిషి జీవించడానికి ఆక్సిజన్ అవసరమని ఆ ఆక్సిజన్ చెట్ల ద్వారా లభిస్తుందని చెట్లే లేకుంటే మనిషి జీవనానికి మనుగడేలేదని ఎంపిపి బెల్లంకొండ మీరయ్య అన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని ఎంపిడిఓ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవించడానికి ఆక్సిజన్ అవసరం - సంక్షేమం అమలవ్వడానికి జగన్ అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ షరీఫ్, ఎంపిటిసి యోహాను, తాళ్ళూరు చింతయ్య, వైకాపా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం



పెదకూరపాడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : వైకాపా ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై ప్రజలను చైతన్యవంతం చేయుటకు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూపొందించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఆదేశాల మేరకు పెదకూరపాడు మండల తెదేపా అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి వడ్లమూడి అప్పారావు, అజుముల్లాలు కంభంపాడు, పెదకూరపాడు గ్రామంలోని 8,9 వార్డులలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కార్య నిర్వహ కార్యదర్శి షేక్.ముంతాజ్, మోదుగుల చంద్రశేఖర్ జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, తాళ్ళూరు వీర వసంతరావు, కృష్ణారావు, కొండవీటి ప్రసాద్, మలాట్ రఫీ, మండల మైనార్టీ కన్వీనర్ షేక్.దిలీప్, వైస్ సర్పంచ్ గుంటుపల్లి కోటేశ్వరరావు, నెల్లూరి మల్లికార్జునరావు, యూనిట్ ఇన్‌చార్జి గుండపనేని బాషా, జిల్లా మహిళా నాయకురాలు ఆరుమళ్ళ సుజాత, బూత్ కన్వీనర్లు షేక్.మునీర్, షేక్.అనీఫ్, జాగర్లమూడి రఘు, షేక్.మొదిన్‌బచ్చా, పఠాన్ షబ్బీర్, కూరపాటి కోటేశ్వరరావు, భావన రాంబాబు, మలాట్ రఫీ, వేమూరి వెంకట్రావు, మాజీ సర్పంచ్ కోరంపల్లి వెంకట్రావు, కోరంపల్లి నరేంద్ర, బెల్లంకొండ శేషగిరిరావు, కొమ్మాలపాటి కోటేశ్వరరావు, నాగూల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జన్మదినం సందర్భంగా ఖోఖో, కబడ్డీ పోటీలు



క్రోసూరు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : సిఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 50వ జన్మదినం సందర్భంగా క్రోసూరులోని జెడ్పీహైస్కూల్‌లో మంగళవారం మండలస్థాయి ఖోఖో, కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీలను ఎంపిపి పెరుమాళ్ళపల్లి కోటయ్య, ఎంపిడిఓ శివరామయ్య, ఎంఇఓ ఏసురత్నం, స్కూల్ హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించి ముందుకు సాగాలన్నారు.

## 23న నియోజకవర్గ సిపిఐ కార్యవర్గ కౌన్సిల్ సమావేశం



పెదకూరపాడు, డిసెంబర్ 20 ప్రభాతవార్త : డిసెంబర్ 22వ తేదీన భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యవర్గ సభ్యులు చల్లపల్లి పానయ్య తెలిపారు. మంగళవారం 75 తాళ్ళూరు సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పానయ్య మాట్లాడుతూ ఈ నెల 22వతేదీన చల్లపల్లి ప్రసాదరావు కార్యాలయంలో పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సమితి సభ్యులు జంగాల అజయ్‌కుమార్, పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి ఏ.మారుతీవరప్రసాద్, పల్నాడు జిల్లా ప్రజా నాట్యమండలి కార్యదర్శి బైరవటం రామకృష్ణ, జిల్లా సిపిఐ కార్యదర్శి కాసా రాంబాబు, పెదకూరపాడు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, ముఖ్య అతిథులుగా హాజరౌతారని తెలిపారు. ఈ సమావేశానికి సిపిఐ కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు సకాలంలో హాజరు కావాలని పానయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బెజ్జ వసంతరావు, జన్నుపాల కోటేశ్వరరావు, ఆటో యూనియన్ అధ్యక్షులు షేక్.సుభాని, పద్మారావు, పట్టణ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

